# సరళ

శ్రీమతి జి. సరస్వతి

గడియారం ఆరు గంటలు కొట్టింది. అస్తమించే సూర్యుని అరుణకిరణాలు పరిసరాలపై వింత కాంతుల్ని వెదజల్లుతున్నాయి. సరళ అప్పుడే లేచి వెళ్ళి గార్డెన్‌లో కూర్చుంది. ఇంతలో జ్యోత్స్న వచ్చి, 'నేను పిక్చర్‌కి వెళ్తున్నా, కారుని థియేటర్‌కి తీసుకురమ్మని డ్రైవర్‌తో చెప్పు' అని వెళ్ళిపోయింది.

'నాకు ఒంట్లో యేమీ బాగులేదు జ్యోత్స్నా! నా దగ్గర కూర్చోవూ?' దీనస్వరంతో అడిగింది. జ్యోత్స్న ముఖం చిట్లించుకొని, 'ఆ పిక్చర్ యీ రోజుతో ఆఖరు. నేను వెళ్ళితీరాలి' అని గబగబా వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళినవైపే చూస్తూ భారంగా నిట్టూర్చింది సరళ. తన చేతుల్లో పెరిగి పెద్దదైన జ్యోత్స్న యీనాడు తనకు దూరమైపోతూంది. 'అమ్మా' అని చుట్టుకొని తిరిగిన జ్యోత్స్నలో యెంత నిర్లక్ష్యం పేరుకొంది! 'అమ్మా' అనే పిలుపే తనకు కరువైంది! తనమనస్సు నామె అర్థం చేసుకోలేదు! పాలిపోయిన ఆమె చెంపలమీదుగా కన్నీళ్లు జారాయి.

◆ ◆ ◆

ఆనాడు ఇరువదేళ్ల అందమైన సరళ కాలేజీలో బి.ఏ. చదువుతూంది. పెళ్ళి చేసుకోగూడదని, పెద్ద చదువులు చదివి స్వతంత్రజీవనం గడపాలని కలలు కనేది.

ప్రకాశరావు సరళ మేనత్తకొడుకు. తల్లిదండ్రుల్ని చిన్నతనంలో కోల్పోయాడు. సరళ తండ్రి పెంచి మద్రాసులో యం.బి.బి.యస్. చదవడానికి పంపాడు. అక్కడ ప్రకాశరావు తన క్లాసుమేటయిన శశిని వివాహం చేసుకున్నాడు. ఇది సరళ తల్లిదండ్రులకు నిరాశను, వ్యధను కలిగించింది. రెండు కుటుంబాల మధ్య బాంధవ్యం సడలిపోయింది.

ప్రకాశరావు సంసారం కొన్నాళ్లు హాయిగా కొనసాగింది. జ్యోత్స్న పుట్టిన కొద్దిరోజులకు శశికి జబ్బుచేసి చనిపోయింది. శశి మరణం ప్రకాశరావును తీవ్రంగా క్రుంగదీసింది. ఇక ఆ ఊళ్లో ఉండలేక విశాఖపట్నం వచ్చాడు.

ఆరేళ్ల తరువాత యింట్లో అడుగుపెట్టిన ప్రకాశరావును సరళ మాత్రమే ఆప్యాయంగా పలుకరించింది. శశి చనిపోయినందుకు సానుభూతి చూపిస్తూ పాపను చేతుల్లోకి తీసుకుంది.

తనరాక మేనమామకు యిష్టంలేదని గ్రహించిన ప్రకాశరావు వేరే వెళ్ళిపోయాడు. సరళ అప్పుడప్పుడు వెళ్ళి చూచివచ్చేది. పాప సరళకు విడని బంధమైంది.

ఇదంతా గమనించిన సరళ తల్లి ఒకరోజు గద్దించింది.

'పెళ్ళి కావలసిన నీవు ఆ అప్రాచ్యుడి యింటికి వెళ్ళడం శ్రేయస్కరం కాదు. వాడితో మనకున్న సంబంధం యేనాడో తెగిపోయింది లోకనిందలకు గురై భవిష్యత్తు పాడుచేసుకోవడం వాంఛనీయం కాదు' అన్నది తీవ్రంగా.

'కళ్లు మూసుకొని అపనిందలు వేసే లోకానికి నేను భయపడను', సరళ కోపంతో అరిచింది

'అనుభవం, లౌకికజ్ఞానం లేని పిన్నవయస్సు నీది. అబద్దమైనా పదిమంది యేకకంఠంతో 'నిజం' అనే పరిగణింపబడుతుంది. నా మాట విని వెళ్లకమ్మా!' సరళ తల్లి శాంతం తెచ్చుకొని కూతురికి నచ్చజెప్పింది.

◆ ◆ ◆

వారంరోజుల తరువాత ఒకరోజు కాలేజీకి వెళ్తూన్న సరళ కారుహారన్ విని ప్రక్కకు తిరిగి చూచింది. ప్రకాశరావు కారుదిగి ఆమెవద్దకు వచ్చాడు

'నీకుకూడ నన్ను దూరం చేసుకోవాలని ఉందా సరళా?' అతని దీనవదనం, ప్రశ్న సరళను కరిగించేశాయి

'నేనేంచేయను ప్రకాశం? నాకు రావాలని ఉన్నా యితరులకు భయపడవలసి వస్తూంది. పాప నాకు జ్ఞాపకంలేని క్షణం లేదు' అన్నది భారంగా.

'నిజమే. నీవొక వెలుగువి సరళా! నాకెలా లభ్యమౌతావు? ఈ అభాగ్యుడికోసం నీ జీవితం

ఊచ్చులోపడటం వాంఛనీయం కాదు' అని వెను దిరిగాడు.

ప్రకాశరావు మాటలు సరళలో క్రొత్తఊహను రేకెత్తించాయి. అతనికి తనను పెళ్ళి చేసుకోవలనే ఉద్దేశం ఉందా? పెళ్ళి చేసుకోకూడదనుకున్న సరళ నిశ్చయం ఆ సంఘటనతో సడలింది.

కొద్దిరోజులవరకు యేవిధమైన నిర్ణయానికి రాలేని సరళ మథనపడింది. అవివాహితగా జీవితాన్ని కొనసాగించడం కష్టమని గ్రహించుకున్న సరళ తనకు బాగా పరిచితుడైన ప్రకాశరావును పెళ్ళిచేసుకోవడం మంచిదని భావించింది.

తండ్రి తనకు పెండ్లి సంబంధాలు చూస్తున్నాడని తెలిసి సరళ తన అభిప్రాయం తల్లితో చెప్పింది. తండ్రికి తెలిసి, అతను మండిపడ్డాడు. ఆ పెళ్ళి జరిగితే తన ముఖం చూచే అర్హత కోల్పోతుం దన్నాడు. ప్రకాశరావే తనకు నచ్చిన వరుడని తన ఉద్దేశం మారదని ఆమె స్పష్టంగా చెప్పేసింది.

◆ ◆ ◆

'ఈ నిర్భాగ్యుడికోసం తల్లిదండ్రుల్ని దూరం చేసుకుంటావా సరళా' అన్నాడు ప్రకాశరావు.

'నేనున్నంత కాలం నీవలా అనుకోవద్దు ప్రకాశం!' అన్నదామె నిశ్చితస్వరంతో.

రిజిష్ట్రార్ ఆఫీసునుంచి వచ్చి యింట్లో అడుగు పెట్టాక, 'నేను చాల అదృష్టవంతుడిని సరళా!' అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

'ప్రకాశం!' సరళ అతని హృదయంలో తల దాచుకుంది.

◆ ◆ ◆

సరళ జ్యోత్స్న నెంతో ప్రేమగా చూచేది. 'అమ్మా' అంటూ పాప ఆమె నొక్క క్షణం వదిలేది కాదు. ప్రకాశరావు మనస్సు తేలికపడింది.

సరళకు కొడుకు పుట్టాడు. అయినా ఆమె జ్యోత్స్నను యెప్పటిలాగే ఆదరించేది. ఆమె నిష్కల్మష హృదయానికి భర్త చాల ఆనందించేవాడు.

◆ ◆ ◆

కాలగర్భంలో పద్దెనిమిది సంవత్సరాలు లీనమైనాయి. జ్యోత్స్న యిప్పుడు ఇంటరు చదువుతూంది. గారాబంగా పెరగడంవలన ఆమెలో అహంభావం, పట్టుదల స్థావరమేర్పరచుకున్నాయి.

సరళ తన 'సవతి తల్లి' అని ఒక నర్సువలన తెలిసినప్పటినుండి జ్యోత్స్నకు సరళపట్ల నిర్లక్ష్యభావమేర్పడింది. చాలా ముభావంగా ఉండసాగింది. జ్యోత్స్నలోని మార్పు సరళను చాల కలవరపరచింది.

'అమ్మంటే యిష్టంపోయిందా జ్యోత్స్నా? తప్పించుకొని తిరుగుతున్నావు', సరళ బాధాపూరితమైన స్వరంతో అడిగింది.

'లోకానికంతటికీ తెలిసిన విషయాన్ని నాదగ్గర దాచి లాభంలేదు. నాకు అమ్మలేదు', జ్యోత్స్న యేదో పోగొట్టుకొన్న విధంగా యేడవసాగింది. సరళ స్తంభించిపోయింది. తను అమ్మ కాదా? జ్యోత్స్న తన కూతురని చెప్పుకొనే హక్కు లేదా? ఇన్నాళ్ల తనప్రేమని జ్యోత్స్న కాదంటూంటే ఆమెకు దుఃఖం పొంగివచ్చింది. తన లక్ష్యం భగ్నమై పోయినట్లు బాధపడసాగింది.

ప్రకాశరావుకు జ్యోత్స్న సరళయెడల చూపే విముఖత ఆశ్చర్యాన్ని కలిగించింది.

◆ ◆ ◆

'నేనే నీ అమ్మను జ్యోత్స్నా! అమ్మ లేదంటే నేను సహించలేను', మగతగా పలవరిస్తున్న సరళ నుదుటిపై చల్లని స్పర్శతో ఉలిక్కిపడింది.

'ఎందుకు బాధపడుతున్నావు? నాతో చెప్పవూ సరళా?' ప్రేమతో ఆమెచేతులు స్పృశిస్తూ అడిగాడు.

'నేను — నేను జ్యోత్స్నకి అమ్మనే కదూ!' వెక్కి వెక్కి యేడుస్తూ అతని హృదయంమీద వాలిపోయింది. సరళ ఆవేదన అతనికి అర్థమైంది. జ్యోత్స్న అపోహలో సరళకు దూరంగా తిరుగుతూందని, అది సరళకు దుస్సహంగా ఉందని గ్రహించాడు. జ్యోత్స్నమీద చాలకోపం వచ్చింది. ఏమీ మాట్లాడలేక సరళను తీసుకొని లోపలికి వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

'అమ్మకు సీరియస్‌గా ఉంది, ఈరోజు కాలేజీ

సెలవుపెట్టి హాస్పిటల్‌కి రా జ్యోత్స్నా!' ప్రకాశరావు కూతురుతో చెప్పాడు. జ్యోత్స్న నిర్లక్ష్యంగా ఊరుకుంది.

'అర్థంలేని అపోహాలతో అమ్మను దూరం చేసుకుంటున్నావు' ప్రకాశరావు తీవ్రంగా అన్నాడు.

'ఇన్నాళ్లూ నన్ను మోసం చేస్తూనే వచ్చారు నాన్నా! సరళ నాతల్లి కాదని నాకు తెలుసు' జ్యోత్స్న అన్నది.

'మోసమా? తల్లిదండ్రుల్ని ధిక్కరించి, నిన్ను హృదయంలో దాచుకొని పెంచిన సరళ నీ తల్లి కాదూ' అతని కంఠం రుద్ధమైంది. జ్యోత్స్న సంబంధం లేనట్లుగా వెళ్లిపోవడానికి అడుగులు వేసింది.

'జ్యోత్స్నా!' ప్రకాశరావు అరిచాడు. ఆమె చటుక్కున వెనుదిరిగి చూచింది.

'సరళ నీతల్లి కానిమాట నిజమే జ్యోత్స్నా! కన్నతల్లికి పిల్లలపై ప్రేమ సహజంగా ఉంటుంది. అందులో అతిశయోక్తి యేమీలేదు. కాని సవతి తల్లి అయినప్పటికీ హృదయంలో దాచుకొని పెంచిన సరళ ప్రేమ గొప్పది కాదూ! అటువంటి అమృత హృదయం మాతృమూర్తి కాదూ! అటువంటి అమ్మను కాదన్నావు. ఆమె హృదయం యెంత క్షోభిస్తూందో నీవు గుర్తించలేకపోతున్నావు. ఇప్పటికైనా సరళ ప్రేమని అర్థంచేసుకొని ఆమెకు మన శ్శాంతి చేకూర్చు!' ప్రకాశరావు భారంగా అన్నాడు.

తండ్రి మాటలు జ్యోత్స్నలో పశ్చాత్తాపాన్ని రేపాయి. సరళ అతిప్రేమతో తనను ఆదరించిన ప్రతిదృశ్యం కళ్లముందు కదిలింది. ఆమెలో ఆవేదన పొంగిపొరలింది.

◆ ◆ ◆

'అమ్మా! నన్ను క్షమిస్తావా?' అంటూ జ్యోత్స్న సరళ చేతులు పట్టుకొని కన్నీళ్లు కార్చింది.

'అమ్మా!' అనే పిలుపు నరనరాల్లో ప్రవహించి సరళ పులకించింది.

'జ్యోత్స్నా!' వాత్సల్యంతో కూతురిని దగ్గరకు తీసుకొని శుష్కహస్తాలతో ప్రేమగా నిమిరింది త్యాగమూర్తి అయిన సరళ.

ప్రకాశరావు సంతోషంగా నిట్టూర్చాడు.


డాక్టరు కే. యన్. కేసరిగారి

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాదమ్స్ స్టాల్సులో దొరుకుతుంది

పాతుర్తిడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి : 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.